క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌: ఎమ్మెల్యేగా గెలుపొంది మొదటి సారిగా ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలోకి వచ్చిన వీర్లపల్లిశంకర్‌ను యండీ ఇబ్రహీం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

శ్రీ వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కొందుర్గు: జిల్లేడ్‌ చౌదరిగూడ మండలం వనం పల్లి గ్రామంలో శ్రీ వీరాంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కనుల పండువగా సాగింది. ఈ సందర్భంగా గత మూడు రోజులుగా గ్రామం లో స్వామివారి ప్రత్యేక పూజలు కొనసాగుతు న్నాయి. ఆదివారం వీరాంజనేయస్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ, నాభిశిల ప్రతిష్ఠ, హోమం వంటివి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు, అన్నదానం వితరణ చేశారు.

ఎమ్మెల్యే ప్రసాద్‌కుమార్‌కు శుభాకాంక్షల వెల్లువ



గడ్డం ప్రసాద్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్‌ నేత వెంకట్‌రెడ్డి

మొయినాబాద్‌: మొయినాబాద్‌ మండలానికి చెందిన కాంగ్రెస్‌ నేత, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొమ్మిడి వెంకట్‌రెడ్డి ఆదివారం వికారాబాద్‌ ఎమ్మెల్యే, కాబోయే అసెంబ్లీ స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వెంకట్‌ రెడ్డి మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసి ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని ప్రసాద్‌కుమార్‌తో చెప్పారు.

మరకత శివాలయంలో కార్తీక పూజలు



మరకత శివాలయంలో స్వామివారికి నక్షత్ర హారతి ఇస్తున్న పూజారులు

శంకర్‌పల్లి/మొయినాబాద్‌: కార్తీక మాసం సందర్భంగా శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామంలోని మరకత శివాలయంలో ఆదివారం కార్తీక పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, లక్ష తులసి అర్చన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ సదానందంగౌడ్‌, భూపాల్‌, దయాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంఘం అధ్యక్షుడిగా ఆంజనేయులుగౌడ్‌



ఆంజనేయులుగౌడ్‌ను సన్మానిస్తున్న అల్లి దేవేందర్‌, ప్రవీణ్‌

మొయినాబాద్‌రూరల్‌: మొయినాబాద్‌ పంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షుడిగా ఆంజనేయులుగౌడ్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం మండల పరిషత్‌ కార్యాలయం ముందు నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్‌, మండల కన్వీనర్‌ ప్రవీణ్‌కుమార్‌లు నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి అజీజ్‌నగర్‌ సుధాకర్‌, కోశాధికారిగా కృష్ణ, ఉపాధ్యక్షుడిగా మాణిక్యం, వెంకటేశ్‌, యాదయ్య, సహాయ కార్యదర్శులు రమేశ్‌, నర్సింహా, యేసయ్య, సామెల్‌, సభ్యులుగా 38 మందిని ఎన్నుకున్నారు.

నర్సరీలో నారు..

సాగులో కొత్త ఒరవడికి నాంది

- వివిధ రకాల పూలపై రైతుల ఆసక్తి
- సంప్రదాయ విధానాలకు స్వస్తి
- ఆధునిక పద్ధతులకు నాంది
- వ్యవసాయంలో రాణిస్తున్న యువదంపతులు



నర్సరీలో పూల నారును పెంచుతున్న నిర్వాహకులు

షాబాద్‌: మారుతున్న కాలానికి అనుగుణంగా సాగు విధానంలో రైతులు కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతున్నారు. సంప్రదాయ విధానాలకు స్వస్తి పలికి ఆధునిక పద్ధతులను పాటిస్తున్నారు. విత్తు దగ్గరే చిత్తు కాకుండా నర్సరీలో పెంచిన నారును నమ్ముకుంటున్నారు. వ్యవసాయ భూమిలో వివిధ రకాల పంటలను పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉన్న ఊరులోనే వ్యవసాయంపై మక్కువతో రాణిస్తున్నారు. తమ పొలంలోనే పూల మొక్కల నర్సరీని ఏర్పాటు చేసుకొని పెంచిన వాటిని మార్కెట్‌ ధర కంటే తక్కువ రేటుకు విక్రయిస్తున్నారు. షాబాద్‌ మండలం సర్దార్‌నగర్‌ గ్రామానికి చెందిన యువదంపతులు దాదె రాజు, స్వప్న రాణిస్తూ తోటి వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వీరు మరో35 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. నెలకు రూ.2లక్షకు పైగానే ఆదాయం పొందుతున్నారు. స్వయం ఉపాధితో రాణించాలని వ్యవసాయంలో ముందుకు సాగుతున్నారు. ఆరు సంవత్సరాల క్రితం గ్రామంలోని తమకున్న 2 ఎకరాల్లో రూ.15లక్షలతో పూల మొక్కల నర్సరీ ఏర్పాటు చేసుకున్నారు. అందులో గులాబీ, చామంతి, బంతి నారు పెంచుతున్నారు. మార్కెట్‌లో గులాబీ నారును రూ. 20వరకు విక్రయిస్తుండగా వారు మాత్రం రూ.12 నుంచి 15 వరకు అమ్ముతున్నారు. చామంతి నారు సైతం రూ. 1.50నుంచి రూ.2 వరకు విక్రయిస్తున్నారు.

నాణ్యమైన నారు సరఫరా..

ఒక రైతుగా తను ఇక్కడే విత్తనాలు పోసి నారు పెంచడంతో రైతులకు అతడిపై నమ్మకం ఏర్పడింది. ఫోన్‌ల ద్వారా నారు బుక్‌ చేసుకుని తీసుకువెళ్తుంటారు. దాదాపు తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి రైతులు ఇక్కడికి వచ్చి నారు తీసుకపోతారు. విజయవాడ, విశాఖపట్నం, అనంతపురం, కడప ప్రాంతాలకు కూడా నారు సరఫరా అవుతుంది. ఇతర ప్రాంతాల నుంచి ట్రాన్స్‌పోర్టులో వచ్చే నారుకంటే ఈ నారుతో మంచి దిగుబడులు వస్తాయని రైతులు సైతం చెబుతున్నారు. వ్యవసాయంలో ఉన్న లాభాలు మరో వ్యాపారంలో రాదని వారు చెబుతున్నారు. తమిళనాడు, కృష్ణగిరి నుంచి గులాబీ నారు విత్తనాలు సెంట్‌బుల్లెట్‌, కస్టార్‌, ఎల్లో ఆరెంజ్‌ రకాలు తీసుకువచ్చి ఇక్కడ నర్సరీలో పెంచుతారు.

35 మందికి ఉపాధి..

రాజు, స్వప్న భార్యాభర్తలు ఉపాధి పొందుతూ మరో 35 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ట్రేలలో ఎరువులు నింపడం, విత్తనాలు వేయడం, నారు మొక్కలు పెట్టడం, రైతులకు నారు తీసి అందించడం వంటి పనులు చేస్తుంటారు. కూలీలకు రోజుకు రూ. 300 వరకు కూలి ఇస్తున్నారు.



నర్సరీ నిర్వహణ, నారును పరిశీలిస్తున్న స్వప్న

వ్యవసాయంపై మక్కువతోనే ఏర్పాటు..



వ్యవసాయంపై మక్కువతోనే నర్సరీ ఏర్పాటు చేసి గులాబీ, చామంతి నారు మొక్కలు పెంచుతున్నానన్నారు. బయట మార్కెట్‌లో గులాబీ మొక్కకు రూ. 20కి పైగానే ధర ఉంది. మా దగ్గర రూ.12నుంచి 15 వరకు లభిస్తుందన్నారు. వివిధ జిల్లాలకు నారు సరఫరా చేస్తున్నామన్నారు.

–దాదె రాజు, నర్సరీ నిర్వాకుహకుడు, సర్దార్‌నగర్‌.

నర్సరీలో పెరుగుదల..



నర్సరీలో నారు పెరుగుదల ఆరోగ్యంగా ఉంటుంది. పంట పొలాల్లో నారు పోస్తే చలికి, వానకు నారు సక్రమంగా మొలకెత్తడంలేదు. విత్తనాలు మొలకెత్తే సమయంలో అధిక ఉష్ణోగ్రత ఉంటే నారు చనిపోతుంది, సాధారణంగా రైతుల పొలాల్లో నారు పెంచే సమయంలో ఇలాగే నష్టపోతున్నారు. చీడపీడల బెడద కూడా ఎక్కువే. నర్సరీలో అయితే ఎండ పడకుండా షేడ్‌నెట్‌లను ఏర్పాటు చేస్తారు. కావాల్సిన సమయంలో నీటిని తుంపర పద్ధతిలో అందిస్తారు. దీంతో నారు ఆరోగ్యంగా పెరుగుతుంది. –బంట్టు కిష్టయ్య, రైతు, లక్ష్మరావుగూడ, షాబాద్‌

హామీలు వెంటనే అమలు చేయాలి

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి తొండ రవి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

శంకర్‌పల్లి/మొయినాబాద్‌: కాంగ్రెస్‌ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి తొండ రవి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రభుత్వం వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం కూడా నిరుద్యోగులను మోసం చేయకుండా వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్లు వేయాలన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలో వీఆర్‌ఓ, వీఆర్‌ఏలను తొలగించి గ్రామస్థాయిలో ఇబ్బందులు సృష్టించిందన్నారు. రెవెన్యూ వ్యవస్థను పటిష్టం చేసి సమస్యలు పరిష్కరించేలా కాంగ్రెస్‌ ప్రభుత్వం శ్రద్ధ వహించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్‌ అధ్యక్షుడు సురేశ్‌, రాజ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలు పేదలకు వరం

సత్యసాయి సేవా సమితి సభ్యుడు గోపాల కృష్ణచారి



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

చేవెళ్ల: గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలు పేదలకు ఎంతో మేలు చేస్తాయని సత్యసాయి సేవా సమితి సభ్యులు గోపాల కృష్ణచారి, రామగౌడ్‌లు పేర్కొన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని శ్రీభగవాన్‌ సత్యసాయి బాబా మందిరంలో ఆదివారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శంకర్‌కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన ఈ శిబిరంలో 100 మందికి పైగా కంటి పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు. వీరిలో కంటి ఆపరేషన్‌లు అవసరం ఉన్న వారిని గుర్తించి వారిని నానక్‌రామ్‌ గూడలోని ఆసుపత్రిలో ఉచిత ఆపరేషన్‌లు నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. ప్రతి నెల రెండో శనివారం ఈ వైద్యశిబిరం నిర్వహిస్తామని శంకర కంటి ఆసుపత్రి ఇన్‌చార్జి విశ్వం తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు పెంటారెడ్డి, మాదవ్‌రెడ్డి, బుచ్చిరాములు, వెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి, విజయ్‌కుమార్‌, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పీర్జాపూర్‌లో భగవద్గీత ప్రచారం



భగవద్గీత ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

కొందుర్గు: త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక మహబూబ్‌నగర్‌ వారి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లేడ్‌ చౌదరిగూడ మండలం పీర్జాపూర్‌లో భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య ప్రబోనంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం జ్ఞాన వేదిక కార్యవర్గ కమిటీ సభ్యులు నాగ్యానాయక్‌ మాట్లాడుతూ వీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల వివరాలను తెలుసుకొనుట వల్ల మద్మాత్మ ఆరాధనలతో ధర్మ స్థాపన జరుగుతుందన్నారు. భగవద్గీతతో జ్ఞానం ద్వారా కులమతాలను రూపుమాపడానికి దోహదం చేస్తుందన్నారు. సర్వ మతాలకు దేవుడొక్కడేనని, దైవ భక్తిని పెంపొందించాలని సూచించారు.

సమసమాజ స్థాపనకోసం పోరాడుదాం



ఆలిండియా అంబేడ్కర్‌ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేశ్‌

షాద్‌నగర్‌: ప్రతిఒక్కరూ సమసమాజ స్థాపనకోసం పోరాడాలని ఆలిండియా అంబేడ్కర్‌ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేశ్‌ అన్నారు. ఆదివారం పట్టణంలో సంఘం డివిజన్‌ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి మహేశ్‌ హాజరై మాట్లాడుతూ అంబేడ్కర్‌ రాసిన రాజ్యాంగంతోనే ప్రజలందరికి హక్కులు, రిజర్వేషన్‌ ఫలాలు అందుతున్నాయని అన్నారు. ఆయన ఆశయ సాధనకోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌, షాద్‌నగర్‌ డివిజన్‌ అధ్యక్షుడు ప్రశాంత్‌, ఫరూఖ్‌నగర్‌ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, చేవెళ్ల మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌, ఉపాధ్యక్షుడు నవాజ్‌, పాల్గొన్నారు

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి: బీజేపీ

యాచారం: కాంగ్రెస్‌ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం సంతోషకరమే కానీ ప్రయాణికులపై ఆధారపడి జీవనోపాధి పొందే ఆటో డ్రైవర్ల జీవనోపాధిని కూడా ప్రభుత్వం గుర్తుంచుకోవాలని బీజేపీ ఎస్టీ సెల్‌ మండల అధ్యక్షుడు గణేష్‌ నాయక్‌ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఆటోలు అత్యధికంగా నడిపించేది ఎస్టీలేనని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆటోల్లో ప్రయాణికులెవరు ఎక్కడం లేదని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

నేడు విజయోత్సవ ర్యాలీ

ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యేగా విజయం సాధించి మొదటిసారిగా కల్వకుర్తి నియోజకవర్గానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రానున్న నేపథ్యంలో సోమవారం కడ్తాల నుంచి కల్వకుర్తి వరకు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నారు. కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో ఈ జరిగే ర్యాలీకి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

రోడ్డుపైనే వాగ్వాదం



తుర్కయంజాల్‌: సాగర్‌ రహదారి తుర్కయంజాల్‌లో రెండు కార్ల యజమానుల నిర్లక్ష్యం కారణంగా భారీగా ట్రాఫిక్‌ స్తంభించింది. చౌరస్తాలోని ఓ వస్త్ర దుకాణం ముందు ఆదివారం మధ్యాహ్నం నిలిపి ఉన్న ఇన్నోవా కారు, డిజైర్‌ కార్లు ఒకదానికి ఒకటి ఢీకొని స్వలంగా డ్యామేజీ అయ్యాయి. దీంతో రెండు కార్లకు చెందిన వ్యక్తులు రోడ్డుపైనే వాగ్వాదానికి దిగడంతో సుమారు అరగంట పాటు భారీగా ట్రాఫిక్‌ జాం ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిత్యం రద్దీగా ఉండే తుర్కయంజాల్‌ చౌరస్తాలో కనీసం ఒక్క ట్రాఫిక్‌ పోలీస్‌ కూడా లేకపోవడంతో నిత్యం ఇలాంటి వివాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. పోలీసులు ఇప్పటికైనా స్పందించి ట్రాఫిక్‌ కానిస్టేబుల్‌ను కేటాయించడంతో పాటు పార్కింగ్‌ సదుపాయం కల్పించని దుకాణందారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కసిరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



ఎమ్మెల్యే కసిరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆయన నివాసంలో నియోజకవర్గ పరిధిలోని ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, అధికారులు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన పనులు, సమస్యలపై చర్చించారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన విద్యానగర్‌ కాలనీ సంక్షేమసంఘం అధ్యక్షుడు పాషా, కార్యదర్శి జంగయ్య, కోశాధికారి సుదర్శన్‌రెడ్డి, సలహాదారులు పాండు, పత్యా నాయక్‌, చెన్నారెడ్డి, పర్వతాలు, ఆరీఫ్‌, నర్సింహా, లక్ష్మీనారాయణ, రమేశ్‌, మాజీ సర్పంచ్‌ కేశవులు, నాయకులు నవీన్‌, రమేశ్‌ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



అభిషేకం చేస్తున్న వీర్లపల్లిశంకర్‌ దంపతులు

షాద్‌నగర్‌రూరల్‌: కిషన్‌నగర్‌ గ్రామ శివారులోని శ్రీ కాశీవిశ్వేరస్వామి దేవాలయంలో ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్‌ అనురాధ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని వారు శివునికి అభిషేకం నిర్వహించారు. ప్రజలందరు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రత్యేక పూజలు చేసినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్‌ తెలిపారు. అనంతరం ఆలయ అర్చకులు సంఘయ్యస్వామి వీర్లపల్లిశంకర్‌ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సజ్జలకాశీనాథ్‌, సజ్జలభువనేశ్వర్‌, అగ్గనూరుబసవేశ్వర్‌, కొంకళ్లచెన్నయ్య, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.


ఆధ్యాత్మికతతో భక్తిభావం

మొయినాబాద్‌రూరల్‌: ఆధ్యాత్మిక చింతనతో భక్తి భావం కలుగుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం అమ్డాపూర్‌ గ్రామంలో మాడి విక్రమ్‌రెడ్డి నిర్వహించిన మహాపడి పూజకు ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరై మాట్లాడారు. అనంతరం మాడి రాంరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, అన్నదానం ఏర్పాటు చేశారు. రాంచందర్‌ గురుస్వామి అయ్యప్పస్వామికి పూజ నిర్వహించి మంగళహారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాడి ప్రభాకర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, స్వాములు మైపాల్‌ రెడ్డి, బల్వంత్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, కె.కృష్ణ, ఎం.మధుసూదన్‌రెడ్డి, అనిష్‌పాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

కొత్తూరు: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కొత్తూరు సీఐ శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కొత్తూరు పట్టణంలోని హనుమాన్‌ ఆలయంలో అయ్యప్ప స్వాములకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆధ్యాత్మికత అలవార్చుకుంటే ఒత్తిడిని జయించొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో స్వాములు దాసరి నర్సింహ్మా, శ్రీను, యాదయ్య, దేవేందర్‌, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకోవాలి

- ఆరు గ్యారెంటీలు అమలవుతాయి
- మేయర్‌ చిగురింత పారిజాతరెడ్డి



మహిళలతో ప్రయాణం చేస్తున్న పారిజాతరెడ్డి

మహేశ్వరం: కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని బడంగ్‌పేట్‌ కార్పొరేషన్‌ మేయర్‌, పీసీసీ కార్యదర్శి చిగురింత పారిజాత రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆరు గ్యారంటీల అమలులో భాగంగా మహాలక్ష్మి పథకాన్ని ఆమె ప్రారంభించి స్థానిక మహిళలతో ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్‌ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఏర్పాటైన రెండు రోజుల్లోనే రెండు గ్యారంటీలను అమలు చేశారన్నారు. ఇచ్చిన ప్రతి హామీలను ప్రభుత్వం అమలు చేసి తీరుతుందన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్‌ మోహన్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ సునీతానాయక్‌, కందుకూరు ఎంపీపీ జ్యోతి, వైస్‌ఎంపీపీ శమంత, తుక్కుగూడ మున్సిపాలిటీ చైర్మన్‌ మధుమోహన్‌, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఈశ్వర్‌, నాయకులు నారాయణ, రాజు, రాజు నాయక్‌, నర్సింహా, బాల్‌రాజ్‌, అంజయ్య, కృష్ణ నాయక్‌, పాండు నాయక్‌, ప్రవీణ్‌, శివ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందేనా ?

ప్రారంభమైన యాసంగి సీజన్‌

- ఎకరానికి రూ.15 వేలా, రూ.10వేలా?
- ఎప్పుడు జమ చేస్తుందో ప్రకటించని ప్రభుత్వం
- అయోమయంలో రైతులు



షాబాద్‌: కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే రైతుభరోసా పథకం కింద ఎకరానికి రూ.7,500 చొప్పున రెండు సీజన్‌లకు ఏడాదికి రూ.15వేలు పెట్టుబడి సాయం ఇస్తామని ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చి సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌ రెడ్డి రైతులకిచ్చిన హామీని నిలబెట్టుకుంటారా? లేదా? అని పలువురు రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో యాసంగి సీజన్‌కు ఎకరానికి ఎంత ఇస్తారనే విషయంలో నేటికీ స్పష్టత లేదు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఎకరానికి రూ.5 వేలు ఇస్తారా? లేక రూ.7,500 ఇస్తారా అనే చర్చ రైతుల్లో జోరుగా సాగుతోంది. యాసంగి సీజన్‌ ప్రారంభమై నెల రోజులు దాటుతోంది. అనేక ప్రాంతాల్లో రైతులు వరినార్లు పోసుకోవడం, నాటు వేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. వానాకాలం ధాన్యం డబ్బులు కూడా రైతుల ఖాతాల్లో పడలేదు. దీంతో పెట్టుబడులకు డబ్బులు లేక తీవ్ర రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎన్నికలకు ముందే ఇవ్వాల్సి ఉన్నా..

పెట్టుబడి సాయం డబ్బులను ఎన్నికలకు ముందే రైతుల ఖాతాల్లో వేయడానికి అప్పటి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ అనుమతి పొందింది. కానీ కొందరు నాయకులు పెట్టుబడి సాయం నిలిపి వేయాలని ఎన్నికల కమిషన్‌ను కోరడంతో ఆ ప్రక్రియకు బ్రేక్‌పడింది. ఎన్నికల ముందే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యి ఉంటే ప్రస్తుతం పెట్టుబడులకు ఉపయోగపడేవి.

97,359 మంది రైతులకు..

జిల్లా వ్యాప్తంగా 97,359 మంది రైతులకు పెట్టుబడి సాయం అందుతోంది. వారంతా ప్రస్తుత యాసంగి సీజన్‌ సాయం ఎప్పుడు అందుతుందోనని ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం విత్తనాలు కొనుగోలు, దున్నడానికి ట్రాక్టర్‌ కిరాయి, ఎరువుల కొనుగోలు, నాట్లువేసే కూలీలకు కూలి చెల్లించేందుకు చేతిలో డబ్బులు లేక అధిక వడ్డీకి బయట అప్పులు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే యాసంగి పెట్టుబడి సాయంపై నిర్ణయం తీసుకుని రైతుల ఖాతాల్లో డబ్బులను జమచేసి ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి...



యాసంగి సీజన్‌ ప్రారంభమైన నేపథ్యంలో కొత్త ప్రభుత్వం రైతుల ఖాతాల్లో వెంటనే పెట్టుబడి సాయం వేసి ఆదుకోవాలి. ఎకరానికి రూ.15వేల చొప్పున వేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వం వెంటనే ఆదిశగా చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలి.

–గంగిడి భూపాల్‌రెడ్డి, రైతు, హైతాబాద్‌, షాబాద్‌,